క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని కుమారరామభీమేశ్వర స్వామిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సోమవారం తెల్లవారు జాము నుంచే స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవికి కుంకుమార్చనలు చేశారు. తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీశారు. పిఠాపురం రాజా గోత్ర నామాలతో తొలి పూజ చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

నేడు జిల్లా మహిళా సమాఖ్య సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా జరిగే జిల్లా మహిళా సమాఖ్య సమావేశాలలో భాగంగా మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్టు సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు కాకినాడ జిల్లా పరిధిలోని మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు సమావేశంలో పాల్గొంటారన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో సమాఖ్య సభ్యులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరు అధ్యక్షతన జిల్లా మహిళా దినోత్సవం జరుగుతుందని చెప్పారు.

పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీ నాయకులతో నేడు సమీక్ష

సామర్లకోట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆదేశాల మేరకు మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల పరిషత్ పరిపాలనాధికారి సాయిబాబు తెలిపారు. మండల పరిధిలో వీకే రాయపురం రెండో ఎంపీటీసీ స్థానం ఖాళీగా ఉండడంతో ఎన్నిక నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలను తెలుసుకోవడానికి రాజకీయ నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్లను సోమవారం సాయంత్రం ఎంపీడీఓ డి.శ్రీలలిత ప్రకటించారు. ఎంపీటీసీ సభ్యురాలు మలిరెడ్డి సూర్యావతి మృతి చెందిన విషయం విదితమే.

నేడు కుక్కుటేశ్వరుని వసంతోత్సవం

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామివారి వసంతోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తెలిపారు. మహా శివరాత్రి ఉత్సవాల అనంతరం 16వ రోజు వసంతోత్సవం నిర్వహిస్తారని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

సామర్లకోట: వివిధ ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలనే నిబంధనల మేరకు ఆయా పాఠశాలల్లో ఉచితంగా ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉచిత విద్యకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏప్రిల్ 4వ తేదీ వరకూ ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు ఉందని ఆయన తెలిపారు.

కళాకారుడు భాస్కరరావుకు సత్కారం



భాస్కరరావును సత్కరిస్తున్న నాటక కళాపరిషత్ సభ్యులు

కొత్తపల్లి: నాటక రంగమే తన జీవితమని ప్రముఖ మేకప్, సెట్టింగుల కళాకారుడు కర్రి భాస్కరరావు అన్నారు. మండలంలోని కొండెవరంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో కళాకారులకు మేకప్, సెట్టింగ్‌లు వేస్తున్న భాస్కరరావును ఆదివారం రాత్రి నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కొండెవరంలోనే పుట్టానని, తన తండ్రి నూకరాజు నాటక రంగంలో స్థిరపడి పేరు ప్రఖ్యాతలు సాధించారన్నారు. వారసత్వంగా తాను కూడా ఇదే రంగంలో స్థిరపడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో పలు నాటకాలకు మేకప్, సెట్టింగ్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాటక కళాపరిషత్ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీరాములు, ఆర్గనైజర్ బర్రే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కొత్తపల్లి: మూలపేటలో వేంచేసిన జగన్నాథ స్వామి, సత్యనారాయణ ఆలయ ఆవరణలో సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

నీరు సాగేదెట్లా..



సామర్లకోట గోదావరి కాలువలో పెరిగి పోయిన గుర్రపు డెక్క

- గోదావరి కాలువలో పెరిగిపోయిన గుర్రపు డెక్క
- అందని తాగు, సాగునీరు
- ఆందోళన చెందుతున్న రైతులు

సామర్లకోట: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతులు, ప్రజలకు శాపంగా మారింది. పంటలకు నీరు అందాల్సిన సమయంలో గోదావారి కాలువలో గుర్రపు డెక్క, తూటికాడ పెరిగిపోవడంతో నీరు సక్రమంగా సాగడంలేదు. దీంతో ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీరు అందడంలేదు. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకూ ఉన్న గోదావరి కాలువ వెంబడి గుర్రపు డెక్క పెరిగిపోయింది. దీనివల్ల ఎత్తిపోతల పథకాలకు, పంట కాలువలకు సక్రమంగా నీరు అందడంలేదు. కాలువలో నీటి మట్టం తగ్గి పంట కాలువలకు నీరు రాని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గుర్రపుడెక్క పెరిగిపోవడంతో పంట కాలువలకు నీరు వచ్చే చానల్స్ వద్ద నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటి నుంచి మరో 35 రోజుల పాటు పంటలకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని రైతులు తెలియజేస్తున్నారు. ఇటువంటి సమయంలో నీరు లేకపోతే పెట్టిన పెట్టుబడి వృథా అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

నీటి ప్రవాహానికి అంతరాయం

గోదావరి కాలువలో గుర్రపుడెక్క పెరిగిపోవడం వల్ల పంట కాలువలకు సాగునీరు సక్రమంగా రావడం లేదు. ఇరిగేషన్ అధికారులు గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలి. పంటలకు 30 రోజుల పాటు నీరందేలా చూడాలి.

– నేతల హరిబాబు, రైతు, సామర్లకోట

అధికారులు నిర్లక్ష్యమే..

ఇటీవల హుస్సేన్‌పురంలో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో దానిలో పశువుల మృతదేహాలు చిక్కుకోవడంతో నీరు కలుషితమై, దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మధ్య ఆ గ్రామ ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారని 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి గుర్రపు డెక్కను కాలిబాట వంతెన నుంచి కిందికి తోశారు. అలాగే స్థానిక మాండవ్యనారాయణస్వామి ఆలయం వద్ద ఉన్న కాలిబాట వంతెన వద్ద కూడా గుర్రపు డెక్క పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతోంది. అక్కడ నుంచి సామర్లకోట నుంచి భీమవరం, జగ్గమ్మగారిపేట, వీకే రాయపురం, ఉండూరు, మాధవపట్నం గ్రామాలకు గోదావరి కాలువ నీరు అందాల్సి ఉంది. అదే విధంగా సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలకు చెందిన ఫిల్టర్ బెడ్ చెరువులకు తాగునీరు సామర్లకోట నుంచే అందుతుంది. సామర్లకోటలోని రైతులకే నీరు సక్రమంగా అందకపోతే ఇక దిగువ ప్రాంత రైతులకు ఏవిధంగా నీరందుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

అలరించిన 'మనిషి మంచోడే', 'మృత్యుపత్రం' నాటికలు



మనిషి మంచోడే నాటికలో ఓ సన్నివేశం



మృత్యుపత్రం నాటికలో ఓ సన్నివేశం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో రెండో రోజు ఆదివారం రాత్రి హైదరాబాదుకు చెందిన కళాంజలి వారితో మనిషి మంచోడే, చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ వారితో మృత్యుపత్రం నాటికలు ప్రదర్శించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ, కళా పరిషత్ చైర్మన్ మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మనిషి మంచోడే

ధనం మనిషిని నడిపించే ఇంధనం. ఆ ఇంధనం కోసం ఒక్కొక్కరూ ఒక్కోలా నటిస్తారనే విషయాన్ని మనిషి మంచోడే నాటికలో కళాకారుడు కళ్లకు కట్టినట్లుగా చూపించారు. కన్న తల్లిదండ్రులకు చెప్పకుండా ప్రేమించి పెళ్ల చేసుకున్న ఓ జంట వేరే కాపురం పెడతారు. అబ్బాయికి తన చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క తన భార్యను పోషించుకోవడానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు అబద్ధం చెప్పి అడ్డదారుల్లో రాత్రిపూట దొంగతనం అలవాటుగా మలుచుకుంటాడు. తనమీద అనుమానం పడిన ఇంటి యజమాని అబ్బాయి నిజస్వరూపాన్ని బయటపెట్టడానికి, బుద్ధి చెప్పడానికి చేసిన ప్రయత్నమే ఈ నాటిక. ఈ నాటికలో మాధవి, మహేంద్ర, కొల్లా రాధాకృష్ణ, సీహెచ్ హరిబాబు నటించారు.

మంచిని మేల్కొలిపే మృత్యుపత్రం

సమాజంలోని అవినీతి, దురాక్రమణలు, దుష్ట సంప్రదాయాలను ఎండగడుతూ మంచికి, మానవత్వానికి పట్టం కడుతూ సమాజానికి మేలు చేయాలనే వృత్తాంతంలో ఈ నాటకం సాగుతుంది. ప్రస్తుతం చదువులేని, చదువుకున్న మనుషుల్లో సైతం స్వార్థం పెరిగిపోయిందని డబ్బు సంపాదనలో పడి చదువు, ఉద్యోగాలను తాకట్టు పెట్టి శవాలుగా జీవిస్తున్న సంఘటనలను ఈ నాటికలో కళాకారులు కళ్లకు కట్టినట్టు చూపించారు. నాటికలో వీసీహెచ్ ప్రసాద్, ఎం.రవీంద్రబాబు, వై.భవాని, పి.తిరుమలరావు, వై.భవానీ నటించారు.

మహిళల చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయవాది రాంబాబు

పెద్దాపురం: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యాయవాది మడికి రాంబాబు అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోసి సోమవారం దివిలి సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రాంబాబు, టి.కామేశ్వరరావు, దుర్గారావు, అత్తిలి ప్రభూజీ మాట్లాడుతూ మహిళల చట్టాలపై వివరించారు. లింగనిర్ధారణ నేరమని, బార్య భర్తల మధ్య వివాదం ఏ విధంగా పరిష్కరించుకోవాలి, లోక్ అదాలత్ ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ హోమియో వైద్యులు పి.మాధవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ వీరభద్రం, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న భళ్లమూడి

పెద్దాపురం: వినియోగదారులు తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని 3, 29 వార్డు సచివాలయంలో సోమవారం సాయంత్రం వినియోగదారుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకువాలన్నారు. సినిమా హాల్స్‌లో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోయినా, అసౌకర్యంగా అనిపించినా వినియోగదారుల తరుపున ప్రశ్నించవచ్చన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు అదనపు సొమ్ములు ఇవ్వాల్సిన అసవరం లేదన్నారు. కిరాణా, కూరగాయాలు కొనుగోలు చేసేటప్పుడు తూకాలు సరిగ్గా చూడాలని తేడాలు ఉంటే వినియోగదారులు తమ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూర్యనారాయణ అన్నారు. అనంతరం వినియోగదారుల చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య, భాస్కరరావు, కేవీవీ లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మూలపేటలో వేంచేసిన జగన్నాథస్వామి (మొండి జగ్గప్ప), సత్యనారాయణస్వామి వార్ల రథోత్సవం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం ఆలయ పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాత్రికి విద్యుత్ దీపాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి వార్ల రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఎస్సై రామలిగేశ్వరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, కో ఆప్షన్ సభ్యులు కారే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఎమ్మెల్యే దొరబాబును సత్కరిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

కొత్తపల్లి: గ్రామాలు, పట్టణాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట కొత్త కాలనీలో పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కొత్తమూలపేటలో నిర్వహించిన పాస్టర్స్ ఫెలోషిప్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఫెలోషిప్ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించారు. పాస్టర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని కులాలు, వర్గాలకు మేలు జరుగుతోందన్నారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పాస్టర్స్ సంక్షేమ భవనాలు నిర్మించుకునేందుకు తన సొంత నిధులతో స్థలాలు కొనుగోలు చేయడమే కాకుండా ప్రభుత్వం ద్వారా భవనాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేషకుమార్, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు జ్యోతుల బాబులు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఫెలోషిప్ మండల అధ్యక్షుడు ఎం.రూపస్, కార్యదర్శి డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ

పెద్దాపురం: స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకత్వ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ కాకినాడ జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సత్తిరాజు, రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి సుమారు 450 కోట్లు తమ సొంత పథకాలకు మళ్లించారన్నారు. ప్రస్తుత అధికార ప్రభుత్వం కూడా అదే పంథాను అనుసరిస్తోందన్నారు. ఇప్పుడైనా సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో ఆకుల సత్యనారాయణ, ప్రకృతి ఈశ్వరరావు, టి.వెంకటరమణ, టి.జీవ, జి.వెంకటరమణ, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, పీఎస్ఎం నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఆత్మ విశ్వాసంతో సన్నద్ధం కావాలి



10వ తరగతి విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: వచ్చే నెల మూడే తేదీ నుంచి 18వ తేదీ వరకూ జరుగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో సన్నద్ధం కావాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ పిలుపు నిచ్చారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలపై అవగాహన పెరగడానికి ఈ నెల 9 నుంచి 20 వరకూ ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతాయన్నారు. పబ్లిక్ పరీక్షలకు కేవలం 28 రోజులు మాత్రమే వ్యవధి ఉందని, ఒత్తిడి లేకుండా ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి రూ.రెండు, వెయ్యి బహుమతిగా అందజేస్తానని ప్రకటించారు. ఆయా సబ్జెక్టుల టీచర్లు వి.రాజు, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, ఏఎల్‌వీ కుమారి, పీడీ తాళ్లూరి వైకుంఠం, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘంతో రైతులకు మేలు



రైతు ఉత్పత్తిదారుల సంఘ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్

పిఠాపురం: హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పిఠాపురం ఇన్‌చార్జి ఉద్యాన శాఖాధికారి పి.అరుణ్‌కుమార్ అన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో నిర్మాణంలో ఉన్న హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘ భవన నిర్మాణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు రైతు బజారు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజారు కార్డుల కోసం రైతులు తమ సమీప రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న వారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘం వల్ల రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని తగిన రేటు వచ్చిన తరువాత అమ్ముకోవడం ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. ఎవరికి వారే తమ పంటలను నేరుగా అమ్ముకోవడానికి ఈ సెంటర్లు ఎంత గానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది బద్ది గోవిందరాజులు, టి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో నూతనంగా నిర్మించిన గొల్లమారెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ రావి రమేష్ ఆధ్వర్యంలో అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీత, జనసేన పార్టీ నాయకుడు పిల్లా శ్రీధర్, సప్తగిరి హేచరీస్ ఎండీ పెదబాబు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. భక్తుల ఆర్థిక సహాయంతో మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

ప్రజా సమస్యలపై సత్వర 'స్పందన'

- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు
- స్పందనకు పది అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. వారం వారం నిర్వహించే స్పందనలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి పది అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ స్థాయి స్పందనకు ఆయా శాఖల నుంచి డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు స్పందనకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ వారం స్పందనకు తొమ్మిది ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్ తదితరులున్నారు.

సూపర్‌వైజర్‌ను అడ్డగించిన మహిళలు



సూపర్‌వైజర్‌తో మాట్లాడుతున్న మహిళలు

సామర్లకోట: స్థానిక ఐసీడీఎస్ సూపర్ వైజర్‌ను 31వ వార్డుకు చెందిన మహిళలు సోమవారం అడ్డుకున్నారు. ఆ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలోని టీచర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ పోస్టును స్థానికులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక మహిళలు కాకినాడ జిల్లా కలెక్టరుకు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీకి స్పందనలో ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదులపై సూపర్‌వైజర్ విచారణ చేయడానికి వార్డులోనికి రాగా మహిళలు అడ్డుకున్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పదో తరగతి అర్హత కలిగి ఉంటే ఆమెకు టీచరు పోస్టు ఇవ్వాలని ఉందని చెప్పారు. దానిని ఆ ప్రాంత మహిళలు వ్యతిరేకిస్తూ వార్డులో డిగ్రీలు పూర్తి చేసిన మహిళలు అనేక మంది ఉండగా, ఆయాకు ఏ విధంగా టీచరు పోస్టు ఇస్తారని నిలదీశారు. దీనిపై తాము పోరాటం చేస్తామని మహిళలు తెలిపారు.